క్లుప్తంగా

రైల్వేలను ప్రయివేట్ పరం చేయొద్దు



డిచ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం భారతీయ రైల్వేలను ప్రయివేట్ పరం చేసి, ప్రజలపై భారం మోపొద్దని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. ఈమేరకు వారు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో సోమవారం డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం స్టేషన్ మేనేజర్ గంగరాజుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈసందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. రైల్వేల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో పాల్గొని, పోరాడుతామన్నారు. కార్మికులు, రైల్వే ప్రయాణికులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



సిరికొండ: మండలంలోని గడ్కోల్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలో ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వారు ఎంపీకి విన్నవించారు. రూ. పది లక్షల వరకు నిధులు మంజూరు చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని వీడీసీ సభ్యులు తెలిపారు. బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చింతకుంట రామస్వామి, వీడీసీ చైర్మన్ రవీందర్‌గౌడ్, గంగారెడ్డి, శ్రీనివాస్, నిమ్మల భాస్కర్ తదితరులు కలిశారు.

సమయపాలన ఏదీ?



సిరికొండ: తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. సిరికొండ తహసీల్ కార్యాలయంలో పది గంటలకు ఉండాల్సిన ఉద్యోగులు పదిన్నర దాటినా రావడం లేదు. సోమవారం ఉదయం పదిన్నర దాటినా కార్యాలయంలోని కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి. పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఆఫీస్‌లో ఎవరు లేకపోవడంతో బయట అధికారుల కోసం ఎదురు చూశారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ధర్పల్లి: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎంపీడీవో బాలకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల జాబితా ప్రకారం అధికారులు, కమిటీ సభ్యులు అర్హులైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకుంటున్నారన్నారు. లబ్ధిదారుల ఎంపిక సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు .

ముగిసిన వాలీబాల్ శిక్షణ శిబిరం



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్‌లో నిర్వహించిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. పడకల్ వాలీబాల్ లీగ్ పోటీల్లో టాగూర్ టీం విజేతగా నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నాగేష్, తిరుపతి, రాజేశ్వర్‌గౌడ్, రవి, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవా పోస్టర్ల ఆవిష్కరణ



ఖలీల్ వాడి/నిజామాబాద్ అర్బన్: నగరంలో సోమవారం మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మీసేవా పోస్టర్లను సీపీ సాయి చైతన్య ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. మీసేవా సెంటర్ నిర్వాహకులపై దాడులు చేస్తే బీఎన్ఎస్ సెక్షన్ 121,122,132 కింద కేసులు నమోదు చేసి, రెండు నుంచి పదేళ్ల వరకు జైలు, జరిమానా విధిస్తారన్నారు. జిల్లాలోని ప్రతి మీసేవా సెంటర్‌లో ఈ పోస్టర్ ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. సభ్యులు సాహిద్‌అలీ, నాజిర్, నరేష్, మహేష్, రాజు, సాగర్, సంతోష్, రవికుమార్ ఉన్నారు.

బీటీ రోడ్ల పనులు పూర్తయ్యేదెప్పుడు?

- నగరంలో నత్తనడకన సాగుతున్న రహదారుల నిర్మాణం
- పలు డివిజన్‌లలో కంకర పోసి వదిలివేసిన గుత్తేదార్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గాయత్రినగర్‌లోని భీమరాయుడిగుడి వద్ద రోడ్డుపై వేసిన కంకర

నిజామాబాద్ సిటీ : నగరంలోని పలు డివిజన్‌లలో బీటీ రోడ్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలివేశారు. కొన్ని డివిజన్లలో పనులు చేసేందుకు ముందుగా రోడ్డును తవ్వి వదిలివేశారు. కొన్ని చోట్ల డ్రెయినేజీలు సైతం తొలగించారు. అటు పనులు పూర్తిచేయక, ఇటు పనుల కోసం రోడ్డును తవ్వడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డు మొత్తం కంకర పోసి ఉండటంతో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు పనులు కేటాయించారు. నగరంలోని గాయత్రినగర్, హనుమాన్‌నగర్, సాయినగర్, కోటగల్లి, వినాయక్‌నగర్, సాయినగర్‌కాలనీల్లో బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. గత పాలకవర్గంలో కేటాయించిన పనులను కాంట్రాక్టర్లు బిల్లులు రాకపోవడంతో చేపట్టలేదు. ఇప్పుడు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ హామీతో కాంట్రాక్టర్లు పనులు చేయడం ప్రారంభించారు. కొన్ని కాలనీల్లో బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. కానీ రోడ్డును తవ్వి కంకర వేసి మధ్యలోనే వదిలివేశారు. నెలరోజులైనా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని డివిజన్‌లలో యూజీడీ పనుల కోసం రోడ్డును మధ్యలో తవ్వారు. అటు యూజీడీ పనులు సాగడం లేదు. ఇటు బీటీ రోడ్డు పనులు సాగడం లేదు. దీంతో కొన్ని కాలనీల్లో కొన్ని రోడ్లగుండా వెళ్లాలంటే వాహనాలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల పనులు వేగవంతం చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



కోటగల్లిలో..

పనులు చేయడం లేదు..



మా డివిజన్‌లో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. కంకర వేసి నెల రోజులైంది. కాంట్రాక్టర్లు రావడం లేదు. పనులు చేయడం లేదు. దీంతో కంకర రోడ్డుమీద నడవాలంటే ఇబ్బందిగా మారింది. సమస్యను ఎవరికి చెప్పాలో అర్థంకావడం లేదు.

–దాసరి చిరంజీవి, కోటగల్లి వాసి

నెల రోజులైనా పనులు సాగడం లేదు



గాయత్రినగర్‌లోని పలు గల్లీల్లో బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మా ఇంటి ముందు రోడ్డు వేస్తున్నారు. బీటీ రోడ్డు కోసం రోడ్డును తవ్వి కంకర వేశారు. నెల రోజులైనా పనులు చేపట్టకపోవడంతో కంకర రోడ్డుపై ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి పనులు వేగవంతం చేయాలి.

–క్యాతం గంగాధర్, గాయత్రినగర్ వాసి

క్యూరింగ్ కోసం సమయం పడుతుంది



నగరంలోని కొన్ని డివిజన్‌లలో బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. గత పాలకవర్గం సమయంలో పనులకు టెండర్లు జరిగాయి. కాంట్రాక్టర్లు ఆలస్యంగా పనులు ప్రారంభించారు. కంకర వేసిన తర్వాత క్యూరింగ్‌కు కొంత సమయం తీసుకుంటారు. అయినా సరే పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లు సూచిస్తాం.

–ఇనాయత్ కరీం, మున్సిపల్ డీఈ



డిచ్‌పల్లిలో రూరల్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధంకండి

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- డిచ్‌పల్లిలో రూరల్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జూన్, జూలై నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని, ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పిలుపునిచ్చారు. డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని ఒక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొత్త, పాత అనే విభేదాలు, మనస్పర్థలు వీడి పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ ఐక్యతతో కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. కార్యకర్తల కృషివల్లే తాను ఎమ్మెల్యేగా మీ ముందు నిలబడ్డానని, కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చిన తాను అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో మనకు బీఆర్ఎస్ పోటీ కాదని, బీజేపీ తోనే పోటీ ఉంటుందన్నారు. కులగణనలో తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. పార్టీ జిల్లా పరిశీలకులు, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని, ఇందుకు తానే ఉదాహరణ అని చెప్పారు. మండల అధ్యక్ష పదవి కోసం ఐదు పేర్లతో కూడిన ప్రతిపాదనలు తనకు అందజేస్తే వాటిని అధిష్టానానికి అందజేస్తానని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల పాటు కాంగ్రెస్ జెండా మోసి పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేసిన కార్యకర్తలకు పార్టీ పదవులు, స్థానిక ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. పార్టీలో సమన్వయ లోపం ఉందని, గ్రూపుల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, మునిపల్లి సాయరెడ్డి, తారాచంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, నవీన్ గౌడ్, సాయరెడ్డి, బాల్‌రాజ్, ఎల్లన్న, చిన్నారెడ్డి, రవి, నాయకులు గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, ఉమ్మాజి నరేష్, వాసుబాబు, ధర్మాగౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, చెలిమెల నర్సయ్య, మహేందర్, ఫిషర్‌మన్ చైర్మన్ బోర్గాం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

హైకోర్టు జడ్జి మృతికి బార్ నివాళి



ఖలీల్‌వాడి: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మృతికి నిజామాబాద్ బార్ అసోసియేషన్ సోమవారం నివాళులర్పించింది. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్‌లో బార్ ఉపాధ్యక్షుడు దిలీప్ అధ్యక్షత జరిగిన సంతాప సమావేశంలో జస్టిస్ ప్రియదర్శిని సేవలను కొనియాడారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. బార్ ప్రధాన కార్యదర్శి మాణిక్‌రాజు, కామారెడ్డి బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మోహన్‌రావు కులకర్ణి, కోశాధికారి నారాయణ దాసు, న్యాయవాదులు సంగమేశ్వర్ రావు, కిరణ్ కుమార్‌గౌడ్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాలి

సుభాష్‌నగర్: దేశంలో అక్రమంగా నివసిస్తున్న, దీర్ఘకాలిక వీసాలు కలిగిన పాకిస్తాన్ పౌరుల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిబంధనలను జిల్లాలో కఠినంగా అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఆయన లేఖ ద్వారా విన్నవించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పత్రాలు లేని, గడువు ముగిసిన వీసాలు ఉన్న, వీసాలు సస్పెండ్ చేసిన పాకిస్తాన్ జాతీయులను వెంటనే గుర్తించాలని విజ్ఞప్తిచేశారు. దేశ అంతర్గత భద్రతకు సంబంధించి అత్యంత కీలకమైన, తీవ్రమైన అంశమని, కావున అలాంటి వ్యక్తుల వివరాలను ఆలస్యం చేయకుండా జాబితా సిద్ధం చేయాలన్నారు. వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే శక్తులపై మునుపెన్నడూ లేని విధంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సంకల్పించారని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే సంస్థలు, దేశాలు తప్పించుకోలేవని ఆయన స్పష్టం చేశారని గుర్తుచేశారు.

విశ్వకర్మల కులవృత్తులను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ నాగారం : ప్రస్తుత కార్పొరేట్ ప్రపంచంలో అంతరించిపోతున్న విశ్వకర్మల కులవృత్తులను ప్రభుత్వం ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల హన్మాండ్లుచారి అన్నారు. నగరంలోని ఆర్అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో సోమవారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విశ్వకర్మల కుల వృత్తులను కాపాడి ఆదుకోవాలని తీర్మానం చేశారు. అనంతరం విశ్వకర్మ నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ నాగార్జున చారి, జిల్లాకి విచ్చేసిన జాతీయ స్పైస్ బోర్డు సెక్రెటరీ(ఐఏఎస్) భవానీశ్రీని సన్మానించారు. కోశాధికారి శ్రీనివాసచారి, కార్యదర్శి శ్రీహరి, జిల్లా అధ్యక్షుడు కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, శంకర్, వేణు, నరసింహాచారి, ఎర్ర శ్రీనివాస్, శ్రీనివాస్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ నాగారం: నగరంలోని పెద్దబజార్‌లో గల శ్రీలక్ష్మీచేయూత సేవా సమితి నూతన కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంగారు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సేవర్తి శ్రీనివాస్, కోశాధికారిగా అల్వాల లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులుగా వంగల రమణాచారి, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్‌రావు, సలహాదారులుగా చిలుముల భూషణ్ చారి, సంయుక్త కార్యదర్శిగా రవేందర్, సభ్యులుగా సదానంద్ చారి, శ్యామ్, వంసత్ రాజ్, మల్లేష్, పవన్ కుమార్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు.

రూరల్ మండల మహిళా సమాఖ్య..



నిజామాబాద్ రూరల్: మండలంలోని పాంగ్రాలోగల సమాఖ్య భవనంలో సోమవారం మండల మహిళ సమాఖ్య పాలకవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రెడ్డి సునీత, కార్యదర్శిగా విజయ, కోశాధికారిగా బైకన్ స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీఎం మహేష్ తెలిపారు. అంతకుముందు మండల సమాఖ్య సమావేశం నిర్వహించి పాలక మండలి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల మహిళ సంఘాల అధ్యక్షులు, మహిళలు పాల్గొన్నారు.

గుగులోత్ సౌమ్యకు సన్మానం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి గుగులోతు సౌమ్యను, కోచ్ నాగరాజును సోమవారం కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుగులోత్ సౌమ్య తమ కేర్ డిగ్రీ కళాశాల విద్యార్థినిగా ఉండడం అదే విధంగా తమ కేర్ ఫుట్‌బాల్ అకాడమీలో కోచ్ నాగరాజు ఆధ్వర్యంలో ఆమె శిక్షణ పొంది ఈ స్థాయికి రావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య వార్షిక అవార్డుల్లో ఉత్తమ క్రీడాకారిణి పురస్కారం సాధించిన తొలి తెలంగాణ క్రీడాకారిణి సౌమ్యనే కావడం విశేషం అని కోచ్ నాగరాజు అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, క్రీడాకారుడు సుధీర్, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, కోచ్ నాగరాజు, సౌమ్య తండ్రి గోపి, కళాశాల ప్రతినిధులు కొయ్యాడ శంకర్, సందీప్ పాల్గొన్నారు

సమాచారం..

- నేడు నగరంలో కరెంట్ కోత

సుభాష్‌నగర్: నగరంలోని 11 కేవీ గూపన్‌పల్లి టౌన్ ఫీడర్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు టౌన్–2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గూపన్‌పల్లితోపాటు గంగస్థాన్ ఫేజ్–2, ఫేజ్ –3, పృథ్వీ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ప్రసాద్‌రెడ్డి కోరారు.

విద్యుత్ సమస్యలను అధికారులకు తెలపాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: విద్యుత్ సమస్యలు ఉంటే అధికారులకు సమాచారమివ్వాలని, ప్రజలు, రైతులు ఎట్టి పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను ఎక్కవద్దని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఆర్ రవీందర్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా డిచ్‌పల్లి డివిజన్ డీఈ అల్జాపూర్ రమేష్, ఏడీఈ బాలేష్ అధ్యక్షతన ఏఈలు, సిబ్బందితో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారోత్సవాల గోడప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఈ రవీందర్ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు నెలకొన్న సమయంలో సిబ్బంది భద్రతను పాటించాలని, ఏ మాత్రం ఏమరుపాటుతో వ్యవహరించవద్దని తెలిపారు. ఇటీవల కాలంలో ఎదురైన ఆపరేషన్ సవాళ్లను ప్రస్తావించారు. విద్యుత్ భద్రత, వ్యవస్థ విశ్వసనీయతను మెరుగుపర్చేందుకు ఉత్తమ సాధనాలను వినియోగించాలని సూచించారు. 1912 టోల్ ఫ్రీ నెంబర్‌పై ప్రజలు, రైతులకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఈలు, ఎస్ఎల్ఐ, ఎల్ఐ, ఎల్ఎం, ఏఎల్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

ఇందల్వాయి: మండలంలోని గౌరారం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కోటి రూపాయల వ్యయంతో అదనపు 5 ఎమ్‌వీఏ ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్లు ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ని ఎస్ఈ రవీందర్ సోమవారం ప్రారంభించారు. డిచ్‌పల్లి డీఈ అల్జాపూర్ రమేష్, ఏడీఈ శ్రీనివాస్, ఎమ్ఆర్‌టీ డీఈ వెంకటరమణ, ఎస్‌పీఎమ్ ఏడీఈ నటరాజ్, టీఆర్ఈ ఏఈ సాయిలు, ఏఈ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	హిట్-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-11.00, 4.40
	రెట్రో-1.30, 7.20, 10.30
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-11.00,1.40,4.30, 10.30
	థండర్‌బోల్ట్స్(ఇంగ్లీష్)-7.40

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	హిట్-9.50, 1.05, 4.20, 7.35, 10.50
స్క్రీన్-2	రెట్రో-10.10, 4.25, 10.40
	థండర్ బోల్ట్స్(3డీ)-1.35, 7.50
స్క్రీన్-3	రైడ్-2(హిందీ)-10.00, 4.25, 10.50; రెట్రో-1.00, 7.25
స్క్రీన్ -4	తుడరుమ్-10.15, 1.35
	సారంగపాణి జాతకం-4.55
	రైడ్-2(హిందీ)-7.45 - జింఖానా-10.45

లలితామహల్ రెట్రో | దేవి థండర్ బోల్ట్స్ 2డీ

నటరాజ్ రైడ్-2(హిందీ) | విజయ్ హిట్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,600	వెండి(కిలో)	99,500
22 క్యారెట్స్	89,355		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	50	పచ్చిమిర్చి	35	50
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	30	50	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	80	120	గోబిగడ్డ	8	16
కాకరకాయ	35	60	గోబిపువ్వు	25	50
వంకాయ	20	40	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	50	80
మెంతికూర	70	100	చామగడ్డ	60	80
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	80	మామిడికాయ	30	50

–సుభాష్‌నగర్

సంక్షిప్తం

ఉత్తమ విద్యార్థులకు అభినందన

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నగరంలోని సెయింట్ జేవియర్స్ పాఠశాల విద్యార్థులను సోమవారం డీఈవో అశోక్ అభినందించారు. పాఠశాలకు చెందిన సాత్విక 581 మార్కులు సాధించినట్లు తెలిపారు. హెచ్ఎం లతాగౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

నిజామాబాద్ సిటీ: భువనగిరి జిల్లాలో ఈనెల 12న జరిగే ఎరుకల నాంచారమ్మ జాతర పోస్టర్‌లను సోమవారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు.నిర్వాహకులు కోనేరు సాయికుమార్ పాల్గొన్నారు.

వెల్నెస్ హాస్పిటల్స్‌కు అవార్డు

నిజామాబాద్‌నాగారం: ‘టైమ్స్‌నౌ’ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘టైమ్స్ నెట్‌వర్క్ ఇండియా హెల్త్ సమ్మిట్ 2025’ సర్వేలో అత్యాధునిక, బెస్ట్ పేషెంట్ సెంట్రిక్ ఆస్పత్రిగా వెల్నెస్ హాస్పిటల్స్ ఎంపికైంది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఇటీవల హాస్పిటల్ నిర్వాహకులు తాళ్ల సుమన్‌గౌడ్, అసద్‌ఖాన్, వివేకానంద రెడ్డిలకు అవార్డు అందజేశారు. హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్ అశోక్ మాట్లాడుతూ.. త్వరలో నిజామాబాద్‌లో వెల్నెస్ హాస్పిటల్స్ బ్రాంచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

కార్ల్‌మార్క్స్‌కు ఘన నివాళి

నిజామాబాద్ సిటీ: జిల్లాకేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో సోమవారం పలు ప్రజాసంఘాల, సీపీఎం ఆధ్వర్యంలో ప్రపంచమేధావి, తత్వవేత్త, సోషలిస్ట్ విప్లవకారుడు కార్ల్‌మార్క్స్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వారు మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సమ్మె నోటీస్ అందజేత

నిజామాబాద్ సిటీ: రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు ముందస్తుగా అనుమతి కోరుతూ కార్మిక సంఘాల నాయకులు సోమవారం ఇన్‌చార్జి ఎంహెచ్‌వో జయకుమార్‌కు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముప్పె సుధాకర్ మాట్లాడుతూ.. సమ్మెలో మున్సిపల్ కార్మికులు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొంటారన్నారు. నాయకులు ఓమయ్య, రమేష్‌బాబు, భూపతి, కే.రాజేశ్వర్, డి.కిరణ్, ఎన్.రవికుమార్ పాల్గొన్నారు.

చోరీల నివారణపై అవగాహన

ఖలీల్‌వాడి: నగరంలోని గాయత్రినగర్‌లోగల వెంకటేశ్వర కల్యాణ మండపంలో సోమవారం దొంగతనాల నివారణపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఇంటి భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తంగా ఉండే విధానాలను వివరించారు.

ఓంకార్ శతజయంతి సభ పోస్టర్ ఆవిష్కరణ

నిజామాబాద్ సిటీ: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే ఓంకార్ శతజయంతి సభ పోస్టర్‌ను సోమవారం జిల్లాకేంద్రంలో ఎంసీపీఐ(యూ) నాయకులు ఆవిష్కరించారు. ఈనెల 12న వరంగల్ జిల్లా మచ్చాపూర్ వద్ద ఓంకార్ శతజయంతిని నిర్వహించనున్నట్లు తెలిపారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

డిచ్‌పల్లి: ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని డిచ్‌పల్లి సీఎల్ఎఫ్ కౌన్సిలర్లు శ్రీనివాస్, జోత్స్న సూచించారు. మండలంలోని కొరట్‌పల్లి గ్రామంలో సోమవారం ఉపాధిహామీ కూలీలకు వారు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల సరైన అవగాహన లేక మోసగాళ్ల వలలో చిక్కుకుని అమాయకులెందరో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.